# హస్తం నిస్తేజం..!

## కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో లొల్లి

- గ్రూపులుగా విడిపోయిన నాయకులు
- ఎవరికి వారే..యమునా తీరే..
- నియోజకవర్గంలో దూకుడు మీదున్న బీఆర్ఎస్ పార్టీ



రంగారెడ్డి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): 'టికెట్ కోసం ఏకంగా ఏడుగురు పోటీపడుతున్నారు. ఒకరు రేవంత్ వర్గీయులైతే.. మరొకరు ఉత్తమ్‌కుమార్ రెడ్డి వర్గీయులు. ఇంకొకరు సిట్టింగ్ ఎంపీ కోమటిరెడ్డి వర్గీయులు. పెద్దల ఆశీర్వాదం తనకే ఉందని.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తానే ఫైనల్ అయినట్లు ఎవరికి వారుగా చెప్పుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తీరు ఎవరికి వారే..యమునా తీరే..అన్నట్లుగా మారింది. టికెట్ రేసులో ఉన్నవారిలో కొందరు పీసీసీలో కీలక పదవుల్లో ఉన్నప్పటికీ.. ఏనాడూ పార్టీని ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేయలేదు. బీఆర్ఎస్ పార్టీలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండి పార్టీ శ్రేణులు దూకుడు మీదుండగా... కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఎన్నికల వేళలోనూ నైరాశ్యం నెలకొంది.'

**కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు**

ఎన్నికల వేళ.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ గ్రూపుల గొడవలతో సతమతమవుతున్నది. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మర్రి నీరంజన్‌రెడ్డి, దండెం రాంరెడ్డి, పాశం లక్ష్మీపతిగౌడ్, శేఖర్‌గౌడ్, కొత్తకుర్మ మంగమ్మ, ఆమె భర్త శివకుమార్ టికెట్ రేసులో ఉన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి టీపీసీసీ చీఫ్ రేవంత్ వర్గంలో ఉంటే.. దండెం రాంరెడ్డి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో, మర్రి నీరంజన్‌రెడ్డి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. ఎవరికి వారుగా టికెట్ కోసం ప్రయత్నం చేసుకుంటున్నారు. పార్టీ క్యాడర్ సైతం చీలిపోయింది. ఈ పరిస్థితుల్లో గతంలో ఉన్న గ్రూపు రాజకీయాలు మరింతగా పెరిగాయి. ఒకరంటే మరొకరికి పొసగక.. ఒకరు హాజరైన కార్యక్రమానికి మరొకరు గైర్హాజరయ్యే పరిస్థితి నెలకొంది. పార్టీ పిలుపునిచ్చిన ఏ ఒక్క కార్యక్రమాన్ని అందరూ కలిసి నిర్వహించే పరిస్థితి లేకుండా పోయింది. మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రస్తుతం పీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా, నీరంజన్‌రెడ్డి, రాంరెడ్డిలు పీసీసీ కార్యదర్శులుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ నేతలు నియోజకవర్గంలో మాత్రం పార్టీ పటిష్టతపై దృష్టి సారించలేకపోవడం పట్ల సొంత పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

**ఎన్నికల్లో కలిసి పనిచేసేనా..**

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ కోసం ఏడుగురు పోటీ పడుతున్నారు. గతంలో మలక్‌పేట్ ఎమ్మెల్యేగా పనిచేసిన ఈయన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి బీఎస్పీ, కాంగ్రెస్ తరపున రెండుసార్లు పోటీచేసి ఓడిపోయారు. ఒకసారి మహేశ్వరం నుంచి కూడా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఎన్నికలప్పుడే నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వస్తారని స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. మర్రి నిరంజన్‌రెడ్డి గతంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీగా పనిచేయగా.. ప్రస్తుతం ఆదిభట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఈయన భార్య నిత్య ప్రస్తుతం మంచాల మండలం జడ్పీటీసీగా ఉన్నారు. దండెం రాంరెడ్డి ప్రజాప్రతినిధిగా పనిచేయనప్పటికీ రాజకీయపరమైన పదవుల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం పీసీసీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆశావహుల్లో ఒకరైన పాశం లక్ష్మీపతిగౌడ్ గతంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీగా, జడ్పీటీసీగా పనిచేశారు. ఈ నియోజకవర్గంలో బీసీ కార్డు సైతం తెరపైకి వస్తోంది. గతంలో ఆదిభట్ల సర్పంచుగా పనిచేసిన శేఖర్‌గౌడ్ బీసీ కోటాలో టికెట్ కేటాయించాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. మరోపక్క బీసీ కోటాలో తుర్కయాంజాల్ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ కూడా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. మంగమ్మకు టికెట్ దక్కని పక్షంలో తనకైనా ఇవ్వాలంటూ ఆమె భర్త శివకుమార్ అధిష్టాన పెద్దలను కోరుతున్నారు. ఈయన గతంలో తుర్కయయాంజాల్ సర్పంచ్‌గా పనిచేశారు. టికెట్ ఎవరికి వచ్చినా కలిసి పనిచేస్తామని నేతలంతా బయటకు చెప్తున్నప్పటికీ తీరా.. అభ్యర్థి ఖరారయ్యాక అందరూ జట్టుగా పనిచేస్తారా? అన్న అనుమానాలను సొంత పార్టీ శ్రేణులే వ్యక్తం చేస్తున్నాయి.

**బీఆర్ఎస్ పార్టీ దూకుడు..**

సీఎం కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికే తిరిగి టికెట్ కేటాయించడంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దూకుడును పెంచాయి. టికెట్‌ను ప్రకటించినప్పటి నుంచే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నారు. గతంలో చేపట్టిన పనులకు ప్రారంభోత్సవాలు చేయడంతోపాటు కొత్త పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. మంత్రులు సైతం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పార్టీ శ్రేణుల్లో జోష్‌ను నింపుతున్నారు. ఈ క్రమంలో వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి నిత్యం పెద్ద సంఖ్యలో చేరికలు ఉంటున్నాయి. ఈసారి ఎన్నికల్లో సైతం నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమాను వ్యక్తం చేస్తున్నాయి.

## ఐదేండ్లకోసారి వచ్చేవారిని నమ్మొద్దు

**ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

**వివిధ పార్టీల నుంచి జోరుగా బీఆర్ఎస్‌లో చేరికలు**

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 8 : ఎన్నికలప్పుడే కాంగ్రెస్‌పార్టీ నాయకులకు ప్రజలు గుర్తుకు వస్తారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండరావిరాల గ్రామం నుంచి 100మంది, యాచారం మండలంలోని అయ్యవారిగూడ నుంచి 70మంది, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని పసుమాముల నుంచి 15మంది, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 22వ వార్డులోని జంగాల బస్తీకి చెందిన అనేక మంది ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎన్నికల ముందు గోనసంచులతో ప్రజల వద్దకు వచ్చి కల్లబొల్లి కబుర్లుచెప్పి లబ్ధి పొందటానికి ప్రయత్నిస్తారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయసంస్థ జిల్లా చైర్మన్ సత్తువెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ కృపేశ్, వైస్ చైర్మన్ యాదగిరి, పార్టీ యాచారం మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కిషన్‌గౌడ్, కౌన్సిలర్లు యాచారం సుజాత, నీలం శ్వేత, మంద సుధాకర్, బర్తాకి జనగ్, సుల్తాన్, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, నీలం బాలు, యాచారం రవీందర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయ్

**వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిక**


**బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మరు**

**ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

ఆమనగల్లు, అక్టోబర్ 8: సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీకి ఘన విజయాన్ని అందిస్తాయని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఆయన అన్నారు. మండల పరిధిలోని సింగంపల్లి గ్రామానికి చెందిన దాదాపు 100 కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీటీసీ దోనాదుల కుమార్, సర్పంచ్ ప్రేమలత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో నగరంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ పథకాలను ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందని ఆయన దుయ్య బట్టారు.

**అభివృద్ధి పథంలో ఆమనగల్లు మండలం**

ఆమనగల్లు మండలం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతుందని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవలే ఆమనగల్లు మండల కేంద్రంలో 50 పడకల దవాఖానకు ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారని, మండలానికి ఇటీవలే పాల్‌టెక్నిక్, డిగ్రీ, కళాశాలలు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో 1100 మందికి రెండో విడుత దళిత బంధు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. గృహలక్ష్మి ద్వారా నియోజకవర్గంలో 4వేల మందికి లబ్ధి చేకూరనున్నదని, 300మంది మైనార్టీలు, ఎంబీసీలకు రూ. లక్ష పూర్తి సబ్సిడీతో అందజేసినట్లు గుర్తు చేశారు. 300 మంది ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు ఆందజేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎ.నర్సింహ, యాదయ్య, స్కైలాబ్, చంద్రమౌళి, సాయిలు, లక్ష్మయ్య, రామకృష్ణ, అరుణ్, వెంకటయ్య, రాజు, సామెలు, సత్తయ్య, యాదయ్య, రాజు, శేఖర్, యాదయ్య, శ్రీను, సాయిబాబా ఉన్నారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

మాడ్గుల, అక్టోబర్ 8 : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన 30 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని రూ.15 కోట్లతో బీటీ రోడ్లు వేస్తున్నామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి 5 వేల ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గానికి దళితబంధు కింద 1100ల కుటుంబాలకు మంజూ రైనట్లు తెలిపారు. మండలానికి స్త్రీ నిధికి రూ.30కోట్లు మహిళలకు అందించామన్నారు. భూములు కోల్పోయిన రైతులకు రూ.155 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ కింద తండాల్లో బీటీ రోడ్ల కోసం రూ. 100 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మండలంలో గృహలక్ష్మి పథకం ద్వారా 600మందికి ప్రొసిడింగ్‌లు త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, సర్పంచ్ రమేశ్‌రెడ్డి, రాజుగౌడ్, మహేశ్, చలమందగౌడ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో భారీగా కాంగ్రెస్, బీజేపీ నేతల చేరికలు



పోతిరెడ్డిపల్లి నేతలకు కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ, అక్టోబర్ 8 : కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 120 మంది నేతలు, కార్యకర్తలు ఆయా పార్టీలను వీడి బీఆర్ఎస్‌లో భారీగా చేరినట్లు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సమక్షంలో జడ్పీటీసీ నాగిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 100 మంది కార్యకర్తలు, నేతలు, వార్డు సభ్యులు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరగా, బీఆర్ఎస్ కొండాయపల్లి గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు నిమ్మలి హన్మంతు, యువజన కాంగ్రెస్ కార్యదర్శి అశోక్, బీజేపీ గ్రామ అధ్యక్షుడు సలిగేరి నరేష్‌ముదిరాజ్, నర్సింహులు తదితరులు 20 మంది కాంగ్రెస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.